క్లుప్తంగా

అధ్యాపకుడు కోప్పోలు ప్రతాప్‌కు డాక్టరేట్


కొప్పోలు ప్రతాప్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న కొప్పోలు ప్రతాప్‌కు కృష్ణా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేయటంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సోము అభినందించారు. సింథసిస్ కారక్టరైజేషన్ అండ్ ఆప్టమైజేషన్ ఆఫ్ ఎఫ్ ఇ బేస్‌డ్ నానో పార్టకల్స్ ఫర్ దెయిర్ యూస్‌ఫుల్ అప్లికేషన్స్ అనే అంశం మీద పరిశోధనాత్మక గ్రంథం సమర్పించినందుకు విశ్వ విద్యాలయం పీహెచ్‌డీ పట్టాను అందజేసినట్లు కొప్పోలు ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు కొప్పోలు ప్రతాప్‌ను అభినందించారు.

రాచర్ల తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు


తహసీల్దార్ వెంకటేశ్వర్లు

రాచర్ల: మండల తహసీల్దార్‌గా ఎల్.వెంకటేశ్వర్లు బుధవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. గతంలో తహసీల్దార్ పనిచేసిన ఎం.దిలీప్‌కుమార్ ఒంగోలు ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రాచర్ల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎల్.వెంకటేశ్వర్లుకి ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలు అప్పగించారు.

వ్యాసరచనలో కస్తూర్బా బాలికల ప్రతిభ


కేజీబీవీ బాలికలను అభినందిస్తున్న సీడీపీఓ

కొనకనమిట్ల: ఒంగోలులో నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాల్లో పాల్గొన్న గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. బుధవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ పర్యవేక్షణలో బాలికల అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సీడీపీఓ సుధామారుతి, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో పాఠశాల బాలికలకు బాలల దేశ సంపద, బాలల హక్కుల పరిరక్షణ మన అందరి బాధ్యత అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా బహుమతులు సాధించారని వివరించారు.

కబడ్డీ శిక్షణ ప్రారంభం


క్రీడాకారులతో ఉపాధ్యాయులు

పెద్దారవీడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ శిక్షణను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీధర్, స్కూల్ చైర్మన్ అల్లు లక్ష్మీగోవిందరెడ్డి బుధవారం ప్రారంభించారు. శ్రీధర్ మాట్లాడుతూ క్రీడా మైదానంలో 12 మంది బాలురు కబడ్డీలో నెల రోజుల పాటు శిక్షణ పొందుతారని, చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయిలో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అల్లు వెంకటేశ్వరరెడ్డి, కాసు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు అబ్దుల్ రహమాన్, జకరయ్య, లింగయ్య, కావిరెడ్డి, హబీబ్, నగేష్, జనార్దన్ పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి

గిద్దలూరు రూరల్: ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ సునిల్ ఖన్నా అన్నారు. పట్టణంలోని చిన్న మసీదు, జామియా మసీదు, షాదీఖాన, ముండ్లపాడురోడ్డులోని ఖాదర్‌వలిస్వామి దర్గాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు స్థానికంగా ఉండే ముస్లిం నాయకులు శ్మశాన స్థల వాటిక అభివృద్ధి కోసం దరఖాస్తు చేసుకోగా వాటిపై పరిశీలించేందుకు ఆయన వచ్చారు. జిల్లా సర్వేయర్‌తో సర్వే చేయించి నివేదికలను తయారు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ముస్లింల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు గుడిసె బాషా, లతీఫ్ ఖాన్, అక్బర్ పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇరువర్గాల ఘర్షణ

గిద్దలూరు రూరల్: రెండు బైక్‌లు ఢీకొని ఐదుగురికి గాయాలైన సంఘటన గిద్దలూరు పట్టణంలోని ఒంగోలు రోడ్డులో పుల్లయ్య పెట్రోలు బంకు సమీపంలో బుధవారం జరిగింది. స్థానిక అర్బన్‌కాలనీకి చెందిన ప్రవీణ్‌కుమార్, సుభాష్, భవానీ ఒకే బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న మరో బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై ఉన్న వారి మధ్య ఘర్షణ తలెత్తి ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఇరువర్గాల వారు గాయపడి చికిత్స నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలలో చేరారు. ఎస్సై మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హామీలు నెరవేరాయి.. అండగా నిలుద్దాం


గార్లదిన్నెలో సంక్షేమ పట్టికను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ


పుల్లలచెరువు: మల్లాపాలెంలో పథకాలు వివరిస్తున్న నాయకులు


దొనకొండ: ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

పొదిలి రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పొదిలి మండలంలోని సూదనగుంటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలోని ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల రూపంలో రూ.26 కోట్ల మేర లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. పథకాల లబ్ధి డిస్‌ప్లే బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కృష్ణ, సర్పంచ్ కసిరెడ్డి కోటిరెడ్డి, నాయకులు అంబవరపు నారాయణరెడ్డి, కొండారెడ్డి, ఎద్దు నగేష్, పంచాయతీ కార్యదర్శి బాలపవన్, శేషగిరి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం గార్లదిన్నె సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సచివాలయ పరిధిలో ప్రజలకు రూ.13 కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి జనార్దన్, సర్పంచ్ కొండయ్య, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్ ఎస్.వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ సానికొమ్ము తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి అనే విధానంతో ముందుకు సాగుతున్నారని, గ్రామాల్లోని ప్రజలు సుభిక్షంగా ఉంటే అప్పుడే రాష్ట్రం బాగుంటుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంఎల్‌ఓ మార్టిన్ తెలిపారు. మండలంలోని రుద్రసముద్రంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మండల సచివాలయ కన్వీనర్ గుంటు పోలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఓ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా పని చేస్తున్నారని, మళ్లీ 2024లో ముఖ్యమంత్రి జగనన్నను చేయాలని తెలిపారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నుబోయిన గురుమూర్తి, దుగ్గెంపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: జగనన్న పాలన జనరంజకంగా కొనసాగుతోందని ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న, ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పాదలంకుటపల్లెలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణంలోని నల్లబండ బజారు సచివాలయంలో ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కోటా నరసింహులు మాట్లాడారు. సచివాలయాలు, వలంటీరు వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రజలు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కౌన్సిలర్ దొంతా లక్ష్మీదేవి, మండల కన్వీనర్ పూలి రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, మండల సచివాలయం కన్వీనర్ ఓబులరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వలి, ఏఈ శంకర్‌నాయక్, వైస్ ఎంపీపీ నోవెల్, ఈఓఆర్డీ చెన్నారావు పాల్గొన్నారు.

రాచర్ల: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ షేక్ ఖాశింబీ అన్నారు. మండలంలోని సోమిదేవిపల్లె సచివాలయంలో..మా నమ్మకం నువ్వే జగన్..కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల్లో సంక్షేమ పథకాలతో వెలుగునిచ్చారన్నారు. రాష్ట్రంలో నాడు–నేడు ద్వారా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం పాఠశాలలను తయారు చేశారని తెలిపారు. అందుకే..ఆంధ్రప్రదేశ్‌కి జగనన్నే ముఖ్యమంత్రి కావాలన్నారు. అనంతరం సంక్షేమ పథకాలు లబ్ధిపొందిన లబ్ధిదారుల జాబితా ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పగడాల దేవి, శ్రీరంగం, సోమిదేవిపల్లె మాజీ సర్పంచ్ వెంగళరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకుడు సూర పాండురంగారెడ్డి, చిట్టెం మార్క్ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డితోనే నిరుపేద జీవితాల్లో వెలుగు రేఖలు నిండాయని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అమిరెడ్డి రామిరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని చిన్నగుడిపాడులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామంలోని సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఇంటింటికీ తిరిగి వారికి అందిన ప్రభుత్వ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. సర్పంచ్ వల్లభనేని పవన్‌కుమార్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఖాసింపీరా, ఎంపీటీసీ సభ్యుడు రాజాకృష్ణ, మాజీ ఎంపీపీ జోగి వెంకటనారాయణ, మండల నాయకులు లాలూనాయక్, చిట్యాల యోగిరెడ్డి, దూదేకుల రసూల్, జంకె సుబ్బారెడ్డి, జడ్డు వెంకటేశ్వరరెడ్డి, వెన్నా బహ్మనందరెడ్డి, ఒంటేరు ఆంజనేయులు, వడ్లమూడి రమణయ్య, ఇరుగదిన్ల బోడయ్య, జచివాలయ కన్వీనర్లు కృష్ణ, పూర్ణకంటి బాబు, మండల సచివాలయాల కన్వీనర్ గుండారెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ వల్లభనేని పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముండ్లమూరు: పేదలు అభ్యున్నతి జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బిజ్జం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని పూరిమెట్లలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు జగనన్న పాలనలో అనేక విధాల లబ్ధి చేకూరిందన్నారు. సర్పంచ్ ఒగులూరి రామాంజి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వరరావు, నాయకులు అన్నపురెడ్డి భిక్షాలు రెడ్డి, పాలెపోగు డగ్లస్, ముసలయ్య పాల్గొన్నారు.

పెద్దారవీడు: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య అన్నారు. మండలంలో చట్లమిట్లలో బుధవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని తెలిపారు. రాత్రి మండల సచివాలయ కన్వీనర్ ఏర్వ వెంకటేశ్వరరెడ్డి ఇంట్లో పల్లె నిద్ర చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, సర్పంచులు ఏర్వ ఆల్లూరమ్మ, పాలగిరి రామాంజనేయరెడ్డి, అంగిరేకుల ఆదినారాయణ, ఎంపీటీసీ గోదావు సుబ్బమ్మ, సోషల్ మీడియా మండల కన్వీనర్ సాంతి నాగార్జునరెడ్డి, పార్టీ నాయకులు దుద్దెల వెంకటరెడ్డి, నాగిరెడ్డి, అమృతపుడి కోటేశ్వరరావు, మెట్టు భాస్కరరెడ్డి, బలుసుపాటి నాగరాజు, బొట్టు కోటిరెడ్డి పాల్గొన్నారు.

తాళ్లూరు (ముండ్లమూరు): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరినట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని బొద్దికూరపాడులో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పులి ప్రసాద్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి, కొప్పుల బాలకోటయ్య, గోపాల్‌రెడ్డి, సన్నపురెడ్డి అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎంఎల్‌ఓ నాగమల్లేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ కేఎస్ రాజు, ఏపీఎం దేవరాజ్ వలంటీర్లు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు అండగా నిలిచారని, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్ది ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టారని జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని గురిజేపల్లి సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, లబ్ధి పొందిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి ఆవిష్కరించారు. నాయకులు గడప గడపకు వెళ్లి జరిగిన అభివృద్ధి కరపత్రాలు పంపిణీ చేశారు. రాత్రి ఆ గ్రామ నాయకుడు కందుల సుబ్బారెడ్డి గృహంలో పల్లెనిద్ర చేశారు. ఎంపీడీవో వైపీ నాగేశ్వర ప్రసాద్, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

పుల్లలచెరువు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో మన రాష్ట్రం సంక్షేమానికి కేరాఫ్‌గా నిలిచిందని మండల పార్టీ కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మల్లాపాలెం సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సర్పంచ్ ఆవుల రవణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరాలు తెలిపే బోర్డును ప్రారంభించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ కందుల వెంకటయ్య, ఎంపీటీసీ రాములు, మాజి సర్పంచ్ రమణారెడ్డి, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రజాప్రతినిధులు నాగేశ్వరరావు నాయక్, రమణయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి–సంక్షేమం జగనన్నకే సాధ్యం

- ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్


ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

దర్శి: రాష్ట్రంలో అభివృద్ధి–సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం బజారు సిమెంట్ రోడ్డును ఆయన బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే నివాసంలో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ నవరత్నాలు పేదల పాలిట వరాలుగా మారాయన్నారు. ప్రతి సంక్షేమ పథకంలో పార్టీలు చూడకుండా నేరుగా లబ్ధి దారుల ఖాతాలకే సంక్షేమ పథకాల ఫలాలు అందజేసి అవినీతి రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని చెప్పారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు పెట్టి పింఛన్‌లు దగ్గర నుంచి ఏ పథకం రావాలన్నా లంచాలు లేనిది పని కాలేదని ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు నేరుగా ప్రజల్లోకి వెళ్లి తాము చేసింది ఇదీ అని సగర్వంగా చెప్పుకుంటున్నారంటే అది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి అని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి 175 సీట్లకు 175 సీట్లు రావడం ఖాయమని ఎమ్మెల్యే మద్దిశెట్టి స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో తాళ్లూరు మండల ఇన్‌చార్జి మద్దిశెట్టి రవీంద్ర, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ షకీలా అమీన్‌బాషా, ఎంపీపీ సుధాఅచ్చయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కట్టెకోట హరీష్, నగర పంచాయతీ కమిషనర్ మహేశ్వరరావు, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, జగన్నాథం మోహన్ బాబు, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ సర్పంచ్ వెన్నపూస శేషిరెడ్డి, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు షేక్ సైదా, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పాఠశాలలోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న అవార్డు గ్రహీత జగన్నాథ్

మార్కాపురం టౌన్: పాఠశాలలోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ తయారవుతుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నాగ జగన్నాథ్, ఎంపిడీఓ చందన పేర్కొన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం వేల కోట్ల రూపాయలను ఖర్చుపెట్టి విద్యా రంగాన్ని అభివృద్ధి చేస్తోందని, వారికి మంచి గైడెన్స్ ఇవ్వాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. గెస్ట్ ఏ కలెక్టర్ కార్యక్రమంలో భాగంగా హాజరైన మార్గదర్శిని జిల్లా అబ్జర్వర్ మార్కాపురం రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని, విద్యార్థి దశ నుంచే వీటిని అలవర్చుకోవాలని సూచించారు. డాక్టర్ శేషుకుమార్ జర్నలిజం, సైకాలజీ, ఫైన్ ఆర్ట్స్ అంశాలపై అవగాహన కల్పించారు. మెంటార్స్ సమీవుల్లా, వెంకటరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న విజయవాడలో మహాధర్నా


మాట్లాడుతున్న రంగారావు

మార్కాపురం: ఈ నెల 27, 28న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న ధర్నాలో భాగంగా విజయవాడలో రైతు సమస్యలపై మహాధర్నా చేపడుతున్నట్లు ఏపీ కిసాన్ మార్చ్ జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు తెలిపారు. బుధవారం మార్కాపురం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతు సమస్యలపై నిర్లక్ష్యం వహించిందన్నారు. రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని, రైతుల ఆత్మహత్యలు నివారించాలన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, డైలీవేజ్ ఉద్యోగులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని కోరారు. రైతు సంఘ ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం పనిదినాలు 200 రోజులకు పెంచి రోజు కూలి రూ.600 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసులు, రఫీ, రూబెన్, బాలనాగయ్య, సోమయ్య, అందె నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను కక్షిదారులు ఉపయోగించుకోవాలి

గిద్దలూరు రూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు ఉపయోగించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.దేవేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం జాతీయ లోక్ అదాలత్ డిసెంబర్ 9న నిర్వహించబోయే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ మార్గం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ఆలోచించేలా చేయాలన్నారు.

లోక్‌అదాలత్‌ను ప్రతి కక్షిదారుడు ఉపయోగించుకునేలా చూడాలన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీసారాదానమ్మ, న్యాయవాదులు, పాల్గొన్నారు.

దొనకొండలో ప్రత్యేక స్పందన రేపు

దొనకొండ: కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వంలో దొనకొండలో 24న ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సువర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవటంతో స్పందన కార్యక్రమాన్ని స్థానిక రైల్వే కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తామని చెప్పారు. కమ్యూనిటీ హాల్ పరిసరాలను పరిశీలించిన అనంతరం అది స్పందన కార్యక్రమానికి అనువైన స్థలంగా నిర్ణయించామని పేర్కొన్నారు. గ్రామాల్లోని ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయాల్లో ఎమ్మెల్సీ గంగుల ప్రత్యేక పూజలు


త్రిపురాంతకేశ్వరంలో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాల్లో ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం ఆలయాల్లో కార్తీక మాసం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అమ్మవారికి కుంకుమార్చనలు, స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్నారు. ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు ప్రసాదశర్మ, విశ్వనారాయణశాస్త్రి ఆశీర్వచనం అందించారు. ఈఓ చెన్నకేశవరెడ్డి శేషవస్త్రం కప్పి ప్రసాదాలు అందజేశారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- కలుజువ్వలపాడులో పల్లెనిద్ర


కలుజువ్వలపాడులో పార్టీ నాయకులతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

తర్లుపాడు: నవరత్నాలతో పేదల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్ వెలుగులు నింపారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కలుజువ్వలపాడులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పల్లెనిద్ర చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోవిడ్ సంక్షోభంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుదేలైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిరాటంకంగా సంక్షేమం కొనసాగించిన విషయాన్ని గుర్తు చేశారు. పథకాల కోసం ప్రజలు ఎదురు చూసే పనిలేకుండా సంక్షేమ క్యాలెండర్‌ను క్రమం తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. వైద్యం, విద్య, సంక్షేమం, అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు తెచ్చినట్లు చెప్పారు. మరోమారు సీఎంగా జగనన్నను గెలిపిస్తే సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం అగ్రభాగాన దూసుకెళ్తుందన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గ్రామ పార్టీ అధ్యక్షుడు మందా కొండారెడ్డి ఇంట్లో ఎమ్మెల్యే బస చేశారు. సచివాలయం పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు శిఖామణి, రమణారెడ్డి, నాయకులు వెలుగొండారెడ్డి, గుమ్మా రాజేంద్రప్రసాద్, మహేశ్‌రెడ్డి, శాంతరావు తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్లలో పోలీసుల తనిఖీ

మార్కాపురం: పట్టణంలోని వివిధ రెస్టారెంట్లలో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. పూలసుబ్బయ్య కాలనీలోని గరుడ రెస్టారెంట్‌లో అనధికారికంగా విక్రయిస్తున్న 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.కోటేశ్వరరావు తెలిపారు.

92 మందికి కంటి ఆపరేషన్

పొదిలి రూరల్: గుంటూరు జిల్లా పెద్దకాకానిలోని శంకర నేత్రాలయకు శుక్లాల ఆపరేషన్ నిమిత్తం బుధవారం 92 మందిని రెండు బస్సుల్లో పంపినట్లు ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.సుగుణకుమార్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్క్రీనింగ్ అనంతరం ఆపరేషన్ చేయాలని నిర్ధారించినట్లు చెప్పారు. వీరందరి బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి ఆస్పత్రికి పంపినగట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నారు శ్రీనివాసరెడ్డి, నరసింహారావు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా నడిపితే చర్యలు

మార్కాపురం టౌన్: లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఆర్టీఓ అమర్‌నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక శ్రీసాధన జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్టీఓ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండి, డ్రైవింగ్ వచ్చిన ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలని స్పష్టం చేశారు. మద్యం సేవించి, అతివేగంతో వాహనాలు నడపొద్దని, బైక్ రేసుల్లో పాల్గొనవద్దని చెప్పారు. ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు రాజగోపాల్‌రెడ్డి, వీఆర్‌కే ప్రసాద్, రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెరటి కోళ్లు పంపిణీ

బేస్తవారిపేట: స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో బుధవారం లబ్ధిదారులకు పెరటి కోళ్లను మండల ఉపాధ్యక్షుడు డి.ఖాజామీయా, సర్పంచ్ తండ్రి బుద్దుల ప్రేమానంద్ పంపిణీ చేశారు. ఏపీఎం రఘునాథబాబు మాట్లాడుతూ బేస్తవారిపేట మండలానికి 90 యూనిట్ల పెరటికోళ్లు మంజూరైనట్లు తెలిపారు.

జాతీయ స్థాయి కరాటేలో మార్కాపురం విద్యార్థి


తేజేష్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ రంగయ్య

మార్కాపురం: ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మార్కాపురంలోని వాసవి విద్యానికేతన్ విద్యార్థి ఇమ్మడి వెంకట తేజేష్ కాంస్య పతకం సాధించినట్లు డైరెక్టర్, ప్రిన్సిపాల్ కె.రంగయ్య తెలిపారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తేజేష్‌ను డైరెక్టర్‌తోపాటు ఏఓ రంజిత్, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు చెన్నారెడ్డిపల్లి విద్యార్థులు


స్పందన


పూజిత

తర్లుపాడు: జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు మండలంలోని చెన్నారెడ్డిపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు అండర్–14 విభాగంలో పి.స్పందన, అండర్–17 విభాగంలో పి.పూజిత ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఒడిశా, పూణెలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున వీరు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. 67వ స్కూల్ గేమ్స్‌లో భాగంగా ఇటీవల కర్నూలులో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. కబడ్డీ అండర్–14 విభాగంలో పాఠశాల విద్యార్థులు గురుకీర్తి, తనీష్‌రెడ్డి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25431

మార్కాపురం డివిజన్

99516 02963 (మార్కాపురం)

99122 25435 (గిద్దలూరు)

Office mail : sakshiongads@gmail.com